సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 22 । నవంబర్ । 2023



కబడ్డీ ఎంపికలు ప్రారంభం

కడప వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా మంగళవారం నిర్వహించిన మహిళల సీనియర్ విభాగం కబడ్డీ ఎంపికలకు విశేష స్పందన లభించింది. -8లో



బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు -8లో

గరిష్టం/కనిష్టం
30.9/20.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం 20.5 - 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి గురువారం ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు(18–35 ఏళ్లు) అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ.13వేల నుంచి 25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు తమ ధృవపత్రాలు తీసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: సంప్రదాయ చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారు పరికరాల కొనుగోలుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. వడ్రంగి, టైలర్, తాపీ కార్మికులు, స్వర్ణకారులు, శిల్పులతో పాటు బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు తయారీదారులు, నాయీ బ్రాహ్మణులు వంటి 18 రకాల వృత్తి దారులకు సంబంధించిన వారికి ఈ అవకాశం కలదన్నారు. పూర్తి వివరాలకు 08562-241137, 9849901140 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష



దాతకు స్వామి ప్రసాదాన్ని బహూకరిస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కడప నగరం ఓంశాంతి నగర్‌కు చెందిన గోశెట్టి తిమ్మగారి మదన్ కుమార్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు చిన్నమాదన్న,రమాదేవిలు దీనిని అందజేశారన్నారు. ఈ సందర్భంగా దాతలచే ప్రత్యేక పూజలు చేయించి స్వామి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపిక



పునీత్‌రాజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రగ్బీ అండర్–14 బాలుర విభాగంలో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన ఎస్. పునీత్‌రాజ్ ఎంపికయ్యాడు. నగరంలోని చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పునీత్‌రాజ్ ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్–14 విభాగంలో చక్కగా రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారున్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ప్రవీణ్‌కిరణ్ అభినందించారు.

● బుకాయింపుతో బురిడీ..

గోప్యతతో గారడీ

● ఓటర్ల వెరిఫికేషన్ పేరిట ఇల్లిల్లూ తిరుగుతున్న ఐటీడీపీ
● టీడీపీ యాప్‌లోకి ఓటర్ల వ్యక్తిగత సమాచారం

సాక్షి ప్రతినిధి, కడప: కడప హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న సుబ్బారెడ్డి ఇంటికి ఐటీడీపీ కార్యకర్తలు వెళ్లారు. వ్యక్తిగత సమాచారం సేకరించారు. మీరెవరు అని ప్రశ్నిస్తే ఓటర్ల వెరిఫికేషన్ అంటూ బుకాయించారు. ఓటరు ఐడీ కార్డులు చూపించమన్నారు. ఫోన్ నంబర్ గురించి వాకబు చేస్తే చెప్పారు. అంతలోనే 'మీరు తెలుగుదేశం కుటుంబంలో మెంబర్‌గా చేరారు' అంటూ మెసేజ్ వచ్చింది. అలెర్ట్ అయిన సుబ్బారెడ్డి మా వ్యక్తిగత సమాచారంతో మీకేం పని మీరెవరు అంటూ నిలదీయడంతో 'సారీ సార్ టీడీపీ ఆఫీసు నుంచి వచ్చామని' జారుకున్నారు.

● కడప సిటీలోని మారుతీనగర్‌లో లెక్కల శ్రీజారెడ్డి అనే ఉపాధ్యాయురాలి ఇంటికి ఐటీడీపీ కార్యకర్తలు వెళ్లారు. ఓటర్ల వెరిఫికేషన్ పేరిట వ్యక్తిగత సమాచారం అడిగారు. ఫోన్ నంబర్ తెలుసుకున్నారు. చెప్పగానే ఓటీపీ వచ్చింది.. చెప్పండని అడిగారు, ఓటీపీ అప్‌లోడ్ చేయడంతోటే టీడీపీ బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్డు డౌన్‌లోడ్ లింక్ ఉన్న మేసేజ్ ఫోన్‌కు వచ్చింది.



మారుతీనగర్‌కు చెందిన శ్రీజారెడ్డి పేరిట డౌన్‌లోడ్ అయిన భవిష్యత్‌కు గ్యారెంటీ కార్డు

☛ గత కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా ఇదే తంతు తెరపైకి వస్తోంది. ఐటీడీపీ కార్యకర్తలు ఓటర్ల జాబితా వెరిఫికేషన్ పేరిట వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారు. ముందుగా 'మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి మేడమ్' అంటూ వినయంగా వస్తారు.. మీరెవరయ్యా అని ప్రశ్నిస్తే ఓటరు లిస్ట్ చెక్ చేస్తున్నాం మేడమ్ అంటూ సమాధానమిస్తున్నారు. ఇందులో ఉన్న మూడు పేర్లు మీవేనా మేడమ్ అంటూ అడిగిన తర్వాత అవునంటే, మీ ఫోన్ నంబర్ చెప్పండని మాటలతో బురడీ కొట్టించి నంబర్ సేకరిస్తున్నారు. ఫోన్ నంబర్ చెప్పగానే వివరాలు టీడీపీ యాప్‌కు అప్‌లోడ్ చేస్తున్నారు. అంతలోనే మీకు ఓటీపీ వచ్చింది చెప్పండి అని అడగడం, చెబితే, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్డు డౌన్‌లోడ్ చేసుకునే లింక్ ఫోన్‌కు రావడం ఒకదాని వెంట ఒకటి జరిగిపోతున్నాయి. అయితే ఓటర్లు ముందుగా స్థానికంగా బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ) వచ్చి విచారిస్తున్నారని భ్రమ పడుతున్నారు. వారడిగే ప్రశ్నలకు విద్యాధికులు, ఉద్యోగులు సైతం జవాబు చెబుతున్నారు. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకపోయినా సరే, సానుభూతి పరులుగా చిత్రీకరిస్తున్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ

ఐటీడీపీ కార్యకర్తలను ఎవ్వరైనా ఎందుకు సమాచారం సేకరిస్తున్నారని ప్రశ్నిస్తే తెలుగుతమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. ఘర్షణలకు పాల్పడుతూ, కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ఈక్రమంలోనే రాజంపేట పట్టణం ఆకులవీధిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవితో గొడవకు దిగారు. 'ప్రజలకు ఇష్టం లేకపోయినా టీడీపీ యాప్‌లో వ్యక్తిగత సమాచారం ఎందుకు అప్‌లోడ్ చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులతో చేసుకోండి' అంటూ సూచించినా చెలరేగిపోయి, దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ వాళ్లే బాధ్యత వహించాలి



ఓటీపీని చూపుతున్న మౌనిక

టీడీపీ వాళ్లు మా ఇంటి వద్దకు వచ్చి మా వివరాలన్నీ సేకరించారు. సమాచారాన్ని సేకరించే వారితో పాటు మా వీధివాళ్ళు కూడా ఉన్నారని మా ఫోన్ నంబర్‌తో పాటు సమాచారాన్ని కూడా ఇచ్చాము. అయితే ఓటీపీ వచ్చింది చెప్పమని అడగటంతో మాకు అనుమానం వచ్చి నిలదీశాం. వారి నుంచి సరైన సమాధానం లేదు. మా సమాచారం సేకరించినందున మాకేమైనా ఇబ్బందులు కలిగితే టీడీపీ వాళ్లే బాధ్యత వహించాలి. –మౌనిక, ఆకులవీధి, రాజంపేట

ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి



మా వీధి ప్రజలు మొదటి నుంచి కులమతాలు, పార్టీలకు అతీతంగా కలిసిమెలసి జీవిస్తున్నారు. అలాంటి మంచి సాంప్రదాయం ఉన్న మాప్రాంతంలో టీడీపీ వాళ్లు చిచ్చుపెట్టారు. అసలు ఒకరి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే హక్కు వాళ్ళకు ఎవరు ఇచ్చారు?. తెలుగుదేశం పార్టీ వాళ్ళు రాష్ట్రమంతా ఇలాగే చేస్తున్నారు. ప్రజల సమాచారాన్ని సేకరించి టీడీపీ వాళ్ళు ఎక్కడికి పంపుతున్నారన్న విషయం వెల్లడి కావాలి. అందువల్ల ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని తగు చర్యలు తీసుకోవాలి. –అమృత, ఆకులవీధి, రాజంపేట

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతు భరోసా కేంద్రం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎంపీ అవినాష్‌రెడ్డి

వేంపల్లి: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో రూ.4కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.40లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలు, రూ.2కోట్లతో నిర్మించిన ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ సభా భవనం, రూ.35లక్షలతో నిర్మించిన ఉప పశువైద్యశాలలను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ హయాంలో రైతులకు గిట్టుబాటు ధరలేక, దిగుబడి రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండేదని అన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం, రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వాటిని ఎప్పటికప్పుడు అందిస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తున్నారన్నారు. అనంతరం ఈనెల 23 నుంచి 27వ వరకు జరిగే కార్తీక గౌరిదేవి మహోత్సవాలలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొనాలని బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్ర శేఖర్ ఆహ్వానించారు. అనంతరం ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఎంపీడీఓ దివిజ, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ రవిచంద్రారెడ్డి, మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ ఎన్.చంద్రశేఖరరెడ్డి, సీఐ చాంద్ బాషా, తదితర మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలైకి ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం కడప మీదుగా శబరిమలైకి రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. సికింద్రాబాద్ నుంచి కొల్లాం (07131)కు డిసెంబరు 10, 17 తేదీల్లో, అలాగే తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07132) కొల్లాం నుంచి సికింద్రాబాదుకు డిసెంబరు 12, 19 తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రైలు కాచిగూడ, డోన్, గుత్తి, కడప, రేణిగుంట, మెట్‌పాలెం మీదుగా వెళుతుందన్నారు. మరో ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి కొల్లాం (07133) వచ్చే జనవరి 7న వికారాబాద్, గుంతకల్లు, కడప, రేణిగుంట మెట్‌పాలెం మీదుగా వెళుతుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో(07134) జనవరి 9న కొల్లాం నుంచి వికారాబాద్ చేరుతుందన్నారు.ఈ అవకాశాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ అధికారుల పనితీరు భేష్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ అధికారుల పనితీరు ప్రశంసనీయమని సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు తెలిపారు. మంగళవారం విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు జిల్లా ప్రజా రవాణా అధికారులకు క్యాష్ అవార్డు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో కడప జోన్ వ్యాప్తంగా వైఎస్సార్ జిల్లా డీపీటీఓ పొలిమేర గోపాల్‌రెడ్డితోపాటు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా డీపీటీఓ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ సెలవుల రద్దీని పురస్కరించుకుని వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రయాణీకులు స్వంత ఊర్లకు వచ్చిపోయే వారి కోసం ఆర్టీసీ ఉద్యోగులు విశేష సేవలు అందించారన్నారు. అందుకోసం సహకరించిన డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. సాధారణ ఛార్జీలతో 420 ప్రత్యేక బస్సులు నడిపామని, 3.02 లక్షల కిలోమీటర్లు బస్సులను తిప్పడం ద్వారా రూ. 1.24 కోట్ల ఆర్జించామన్నారు. ఇదే జిల్లా పరిధిలో కడప డిపో అత్యధికంగా 134 బస్సులు తిప్పడం ద్వారా రూ. 41 లక్షల ఆదాయాన్ని సాధించినందుకు డీఎంను కూడా సన్మానించారన్నారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డికి క్యాష్ అవార్డును అందజేస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు

జిల్లాకు వర్షసూచన

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌జిల్లాలో రాబోవు 5 రోజుల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని కృషి విజ్ఞానకేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామిచైతన్య తెలిపారు. ఇందులో పగటి ఉష్ణోగ్రతలు 29.2 నుంచి 33.8 వరకు రాత్రి ఉష్ణోగ్రతలు 21. 2 నుంచి 23.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చని తెలిపారు. ఈశాన్య దిశగా గాలులు గంటకు 4.0 కిలీమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో అదనపు అధికారులను మంగళవారం నియమించారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యలు నూతన అధికారులుగా నియమితులైన డా॥ఎం.మమతకుమారి (మెటీరియల్‌సైన్స్ అండ్ నానోటెక్నాలజీ), డా॥కె.శ్రీనివాసరావు (కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ)లకు నియామక పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన డా॥ఎస్.ఆదినారాయణరెడ్డి, డా॥ఎస్.సుమిత్రల పదవీకాలం పూర్తికావడంతో పైవారిని నియమించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

లక్షణమైన జీవితం



పరాయి దేశాల్లో లక్షణమైన ఉద్యోగం.. నెలతిరిగేసరికి లక్షల రూపాయల జీతం ఒళ్లోకొచ్చి వాలేవి.. అవేవీ అతనికి సంతృప్తి ఇవ్వలేదు.. సొంతూరికి మించింది ఏదీ లేదనుకున్నాడు. అంతే ఊళ్లోకొచ్చి వాలిపోయాడు. మెకానికల్ ఇంజినీర్ హోదాను పక్కనబెట్టి పొట్టేళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. కష్టేఫలి సూత్రాన్ని మంత్రంగా చేసుకుని అడుగు ముందుకేశాడు. ఇప్పుడూ లక్షల రూపాయాలు ఆర్జిస్తున్నాడు.. కాకపోతే పరాయి దేశంలో కాదు సొంతూరిలో.. ఒకరి వద్ద కూలీగా కాదు.. యజమానిగా.. కురబలకోటకు చెందిన మోహన్ కుమార్ రెడ్డి విజయగాథపై కథనం.

● పొట్టేళ్ల పెంపకంలో రాణిస్తున్న మెకానికల్ ఇంజినీర్
● వినూత్న పద్ధతిలో ఎలివేషన్ షెడ్డు
● ఇంటి వద్దే ఉంటూ లక్షల ఆదాయం




మధ్యాహ్నంవారిపల్లెలో ఉన్న మోహన్ కుమార్ రెడ్డి పొట్టేళ్ల ఫారం

కురబలకోట: కురబలకోట మండలంలోని మధ్యాహ్నంవారిపల్లెకి చెందిన మెకానికల్ ఇంజినీరు బి. మోహన్ కుమార్ రెడ్డి పొట్టేళ్ల పెంపకంలో రాణిస్తున్నాడు. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, హైదరాబాదు, చెన్నైతో పాటు గల్ఫ్‌లోని ఖత్తర్‌లో కూడా మెకానికల్ ఇంజినీర్ హోదాలో ఉద్యోగం చేశాడు. నెలకు రూ. 1. 5 లక్షలకుపైగా జీతం వచ్చేది. ఎంత చేసినా ఎన్ని చేసినా ఉన్న ఊరికి సాటిరాదని గుర్తించాడు. అంతే ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాలతో విత్తన పొట్టేళ్ల పిల్లల పెంపకం గురించి కళ్లారా చూశాడు. ఊరుకాని ఊరిలో ఎవరి వద్దో పని చేయడం ఎందుకని రెండేళ్ల క్రితం స్వగ్రామం చేరుకున్నాడు.

రూ. 14 లక్షలతో షెడ్డు ..

ఊరి వద్దే పొలం పక్కన రూ. 14 లక్షలతో ఎలివేషన్ షెడ్డు వేశాడు. గొర్రెల మేతకు అవసరమయ్యే గడ్డిని మూడు ఎకరాల్లో వేశాడు. దీన్ని కట్ చేయడానికి కట్టర్ తెచ్చాడు. తనే స్వయంగా గడ్డి కత్తిరించి రోజుకు మూడు సార్లు వాటికి వేసి మేపుతున్నాడు. మేలు జాతి పొట్టేళ్ల పిల్లలను నెల్లూరు జిల్లా గూడూరు నుంచి జుడిపి జాతి పిల్లలను తెచ్చి ఇక్కడ మేపుతున్నాడు. ఎంపికలో జాగ్రత్త వహిస్తాడు. ఇప్పుడు రూ. 6 లక్షలు విలువ చేసే 50 దాకా పొట్టేళ్లు ఉన్నాయి. కిలో 550 చొప్పున లైవ్ వెయిట్‌తో వీటిని అమ్ముతున్నాడు. డోర్ డెలివరీ కూడా ఇస్తున్నాడు. ఇతను స్వతహాగా మెకానికల్ ఇంజినీరు కావడంతో బీఎంఆర్ ఫార్మ్ పేరుతో సోషల్ మీడియా మాధ్యమాల్లో కూడా పొట్టేళ్ల పెంపకం వాటి అమ్మకాల గురించి వివిధ సైట్‌లలో ఉంచాడు. దీని ద్వారా కూడా గిరాకీ లభిస్తున్నట్లు చెబుతున్నాడు. చలి, వర్షాకాలంలో జాగ్రత్తగా చూసుకోవాలి. శ్రద్ధంగా మేపుకుంటే బంగారంతో సమానమే అంటాడు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసే బదులు ఉన్న ఊరిలో పొలం ఉంటే వీటిని మేపుకుంటే హాయిగా బతుక్కోవచ్చని సంతోషంతో చెబుతాడు.



జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది

మెకానికల్ ఇంజినీరుగా ఉద్యోగం చేసేటప్పుడు కర్నాటకతో పాటు కత్తర్‌లో పొట్టేళ్ల పెంపకం గురించి చూశా. ఉన్న ఊరి గాలికి ఏదీ సాటి రాదు. మెకానికల్ ఇంజినీరుగా ఎవరి వద్దో పని చేయడం ఎందుకని స్వయం ఉపాధి కింద ఈ పనిచేస్తున్నా. మూడు లేదా నాలుగు నెలల వయస్సు పొట్టేళ్ల పిల్లలను తీసుకు వస్తా. బరువు, సైజు, వయస్సును బట్టి రూ.12 వేల నుంచి రూ.14 వేలు పడుతుంది. ఇవి 12 నుంచి 15 కిలోల వరకు బరువు ఉంటాయి. వీటిని షెడ్డులో ఆర్నెళ్ల పాటు మేపుతా. 40 నుంచి 45 కిలోల బరువుకు వస్తాయి. సొంత పొలం. సొంత గడ్డి. కూలీల ఖర్చు లేదు. నెలకు ఎలా చూసుకున్నా ఆదాయంలక్షకు తగ్గదు.

–బి. మోహన్ కుమార్‌రెడ్డి, పొట్టేళ్ల ఫారం నిర్వాహకులు, మధ్యాహ్నంవారిపల్లె, కురబలకోట

పొట్టేళ్ల పెంపకం లాభదాయకం



పొట్టేళ్ల పెంపకం ఎందరికో జీవనోపాధిని ఇస్తోంది. మాంసానికి, మేలు జాతి విత్తన పొట్టేళ్లకు తరగని డిమాండు ఉంటోంది. పొట్టేళ్ల పెంపకం కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే బంగారంకు ఏమాత్రం తీసిపోదు. ప్రభుత్వం కూడా గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. షెడ్ల నిర్మాణానికి, గొర్రెల, మేకల పెంపకానికి సబ్సిడీ రుణాలు ఇస్తోంది. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) కింద 50 శాతం రాయితీ ఉంది. –నవీన్, పశువైద్యాధికారి, కురబలకోట



రైలు కింద పడి మహిళ మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కనుమలోపల్లె రైలు మార్గంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ(50) మృతదేహం గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు. మృతురాలి సంబంధీకులు కడప రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అనారోగ్యంతో ఉన్న 60 ఏళ్ల వృద్ధుడిని ఈ నెల 10న 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతున్న అతను ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఈ వ్యక్తికి సంబంధించిన బంధువులు ఔట్‌పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి వరాలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడిన వరి గడ్డి లోడుతో ఉన్న ట్రాక్టర్

సింహాద్రిపురం : మండల పరిధిలోని అగ్రహారం గ్రామ సమీపంలో మంగళవారం వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను లారీ క్రాస్ చేసి వెళుతున్న సమయంలో వరిగడ్డి లోడు ట్రాక్టర్‌కు లారీ తగులుకోవడంతో ట్రాక్టర్ రోడ్డుపైనే బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదే ట్రాక్టర్ సైడు గుంతలో పడి ఉంటే పెను ప్రమాదం సంభవించేది. గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో దూది దగ్ధం

పోరుమామిళ్ల : పట్టణంలోని తాజ్ రెస్టారెంట్ సమీపంలోని ఓ గదిలో నిలువ చేసిన దూది బస్తాలకు మంగళవారం ఉదయం నిప్పంటుకుంది. గది నుంచి దట్టంగా పొగలు వస్తుండటంతో యజమాని మాబువలి గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి నష్టాన్ని తగ్గించారు. ఫైర్ ఆఫీసర్ నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దూది కాలిందన్నారు. కాలిపోయిన దూది విలువ రూ.50 వేలు ఉంటుందన్నారు.

మత్స్యకార కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి
- ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం మత్స్యకార కుటుంబాల్లో ఆర్థిక భరోసాను నింపుతోందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సహాలదారు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని నిర్వహించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా తీర ప్రాంత మత్స్యకారులకు, ఓఎన్‌జీసీ బాధితులకు పరిహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు స్థానిక కలెక్టరేట్ స్పందన హాలు నుంచి జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట సుబ్బమ్మ, జిల్లా మత్స్యకార సంఘం ఉపాధ్యక్షుడు జమాలయ్య, జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి కిరణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ముగిసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రధానంగా వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం మత్స్యకార కుటుంబాల్లో ఆర్థిక భరోసాను నింపుతోందన్నారు. చేపల వినియోగాన్ని పెంచేందుకు చిన్న, పెద్ద వాణిజ్య కేంద్రాలను ఫిష్ ఆంధ్ర పేరుతో రాయితీలతో ప్రోత్సహిస్తున్నారన్నారు. జిల్లాలో 12 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న 156 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 6 రిజర్వాయర్లను జిల్లాలోని 30 మత్స్యకార సంఘాలకు తక్కువ ధరలకే లీజు కేటాయిస్తామన్నారు. అలాగే 3 పెద్ద జలాశయాల్లో మత్స్యకారులు వేట చేసుకునేందుకు స్వల్ప రుసుంతో లైసెన్సులు జారీ చేశామని తెలిపారు. మత్స్యశాఖ డీడీ నాగలింగాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో మత్స్యకార కుటుంబాలకు అందేలా చర్యలు చేపడతామన్నారు. అంతేకాకుండా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం(కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా)లో భాగంగా రూ. 20 లక్షల ఖరీదు చేసే రెండు చేపల వాహనాలను, 60 శాతం రాయితీతో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు, పలువురు మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ ఎంపికలు ప్రారంభం



మాట్లాడుతున్న కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

- తొలిసారిగా కబడ్డీ మ్యాట్స్‌పై నిర్వహణ
- ఉద్యోగాలు సాధించిన సీనియర్ కబడ్డీ క్రీడాకారిణులకు సన్మానం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి మహిళల సీనియర్ విభాగం కబడ్డీ ఎంపికలకు క్రీడాకారిణుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్‌ఆర్ జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడాకారులకు అసోసియేషన్ ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లేందుకు అవసరమయ్యే ప్రయాణఖర్చులు, క్రీడాదుస్తులను తన సొంత నిధులతో అందజేస్తానని తెలిపారు. అదే విధంగా జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారిణులకు ఇన్సూరెన్స్ చేయిస్తామని తెలిపారు. కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారిణులు ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వ తేదీ వరకు కర్నూలు జిల్లా గోనగండ్లలో నిర్వహించనున్న 70వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ అంతర్ జిల్లాల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లాజట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు క్యాంపు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులకు చక్కటి శిక్షణ లభిస్తుండటంతో రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం చక్కగా రాణిస్తున్నారన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను చక్కగా ప్రోత్సహిస్తోందని, త్వరలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రలో ఎక్కువ సంఖ్యలో కబడ్డీ క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు. అనంతరం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన కబడ్డీ సీనియర్ క్రీడాకారిణులు సుహాసిని, శ్రీవాణి, అరుణ, లీలావతిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలు మాట్లాడుతూ కబడ్డీ క్రీడకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారి ఎంపికలను మ్యాట్స్‌పై నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ శిక్షకుడు ఆర్.వి. శ్రీధర్, కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి కొండయ్య, సంయుక్త కార్యదర్శి ఆర్. సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్. సాజిత్, బి. నిత్యప్రభాకర్, నాగమణి, బి. విజయలక్ష్మి, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు రుణమేళా విజయవంతం

రూ. 2 కోట్ల 30 లక్షలకు తాత్కాలిక రుణ పత్రాలు జారీ



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ, జీఎం

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం కడప బ్యాంకు ఆవరణంలో నిర్వహించిన రుణమేళా విజయవంతమైంది. ఈ రుణమేళాలో 47 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎక్కువ మంది ఆస్తి తనఖా రుణాల కోసం వచ్చారు. వీరితోపాటు మరి కొంతమంది వ్యాపార నిర్వహణ, వాహనాల కొనుగోలు కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. ఈ రుణమేళాలో సుమారు రూ. 2 కోట్ల 30 లక్షలకు తాత్కాలిక మంజూరు పత్రాలను ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల కంటే వడ్డీ ఎక్కువ ఇచ్చేది డీసీసీ బ్యాంకేనన్నారు. ఈ బ్యాంకులో ప్రస్తుతం వంద రూపాయలతో ఖాతాలను ప్రారంభిస్తే ఖాతా తెరిచిన వారికి రూ.2 లక్షల సురక్ష బీమా యోజన సౌకర్యం కూడా ఉంటుందన్నారు. అలాగే మరో రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశం వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు ఉందన్నారు. ఈ రుణమేళాలో డీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాజామణి, డీజీఎంలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏజీఎంలు రాజేంద్రకుమార్ రెడ్డి, వీరబ్రహ్మం, నారాయణరాజులతో పాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ చంద్రబాబుకు తొత్తు

టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్. యానాదయ్య



కడప కార్పొరేషన్ : బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చంద్రబాబు తొత్తు అని టీటీడీ బోర్డు సభ్యుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్. యానాదయ్య విమర్శించారు. కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్షా అరవై ఐదు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీలను దూరం చేసే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. కాపులను బీసీలో చేరుస్తామని చంద్రబాబు అంటే అప్పుడు నోరు మెదపని రామచంద్ర యాదవ్, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. రామచంద్ర యాదవ్ చంద్రబాబు బినామీ అని, టీడీపీ, జనసేనకు ఆయన బ్రోకర్‌గా మారారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, శ్రీనివాస యాదవ్, ఆర్‌వీ రమణ, సుబ్బరాయుడు, మనోజ్, విజయకుమారి పాల్గొన్నారు.

ప్రజలు క్షమించరు



మరకా శివకృష్ణారెడ్డి



రుక్మిణిదేవి

పులివెందుల రూరల్ : ఎవరి మెప్పు కోసమో అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న రామచంద్రయాదవ్‌ను ప్రజలు క్షమించరని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర డైరెక్టర్ మరకా శివ కృష్ణారెడ్డి, పులివెందుల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రుక్మిణిదేవిలు అన్నారు. పులివెందులలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అక్రమ సంపాదన, నయవంచన రామచంద్ర యాదవ్‌కే చెల్లుతుందన్నారు. బీసీల ద్రోహిగా, చరిత్రహీనుడిగా అతను మిగిలిపోతాడన్నారు. నాలుగున్నర సంవత్సరాలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నామినేటెడ్ పదవులు, మంత్రి పదవుల్లోనూ ముఖ్యమంత్రి పారదర్శకత పాటించారని తెలిపారు. ఎవరో ఉసిగొలిపితే వచ్చి కేసు పెట్టడం తగదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలకు, అసంబద్ధ ప్రకటనలకు రామచంద్ర యాదవ్ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతల పెత్తందారీ మనస్తత్వానికి మద్దతు తెలుపుతూ వారి రాజకీయ పార్టీలకు పాలేరుగా పనిచేస్తున్న రామచంద్ర యాదవ్ వికృత చేష్టలను రాష్ట్రంలోని బీసీలందరూ గమనిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సీఎంకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రెడ్డి సేవా సమితి సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్ : కడప నగరం రాజీవ్‌మార్గ్‌లోగల రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి సంబంధించి సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. తెలుగువారి అతి ముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతి సందర్భంగా గ్రామీణ క్రీడలతోపాటు గ్రామీణ ప్రాంతాల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరుగున పడుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలు, వాటితో ముడిపడిన ఆటల పోటీలు నిర్వహించాలన్నదే ధ్యేయమన్నారు. ఈ పోటీలలో పూర్వపు వైఎస్సార్ జిల్లా పరిధిలోని వారంతా పాల్గొనవచ్చని తెలిపారు. కర్రసాము, కబడ్డీ, చెక్క (అడుగు) భజన, కోలాటం, తాడులాగుడు (టగ్ ఆఫ్ వార్) పోటీ, ముగ్గుల పోటీ, బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనదలచిన వారు డిసెంబరు 5వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా పూర్తి చేసిన దరఖాస్తులను వారివారి పరిధిలోని పంచాయతీ కార్యదర్శిచే ధ్రువీకరించి పోస్టు లేదా స్వయంగాగానీ అందజేయాలన్నారు. వివరాలకు రెడ్డి సేవా సమితి 1/80–14, రాజీవ్‌మార్గ్, ఎర్రముక్కపల్లె, కడప చిరునామాలో లేదా 9440651284, 9989465956 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

విద్యాశాఖ సమీక్షలో డీఈఓ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ, ఎస్ఎస్ఏ పీఓ

కడప ఎడ్యుకేషన్ : బడిఈడు పిల్లలంతా పనిలో కాదని బడిలోనే ఉండాలని అందుకు విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సచివాలయ వార్డు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు వందశాతం స్కూల నమోదు నిష్పత్తి సాధనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ సహాయంతో ప్రతి ఒక్క వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ బడిఈడు పిల్లలందరిని వందశాతం పాఠశాలల్లో నమోదు చేయించాలని ఆదేశించారు. అదే విధంగా సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతి వారం వారి పరిధిలో పాఠశాల తనిఖీలు నిర్వహించాలన్నారు. వీటితో పాటు విద్యార్థుల హాజరు, జగనన్న గోరుముద్ద లాంటి వాటిపై కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టే దిశగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, కలెక్టరేట్ కంట్రోల్‌రూం ప్రతినిధి అనిల్‌తోపాటు మండల విద్యాశాఖ అధికారులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సచివాలయ వార్డు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పొడదుప్పి మృతి

గోపవరం : మండలంలోని రాచాయపేటలో మంగళవారం కుక్కలు దాడి చేయడంతో పొడదుప్పి మృతి చెందింది. వెంటనే స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బద్వేలు రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, ట్రైనీ ఐఎఫ్ఎస్ శుభం, బీట్ ఆఫీసర్ సువర్ణకుమార్‌లు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతిచెందిన పొడదుప్పిని బద్వేలుకు తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం ఖననం చేశారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో అడవి జంతువులు తాగేందుకు నీరు దొరకకపోవడంతో గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పొడదుప్పి రాచాయపేట ఎస్సీకాలనీ సమీపంలోకి రావడంతో కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

వృద్ధాప్యం, అనారోగ్యం వల్లే చంద్రబాబుకు బెయిల్

- వాస్తవాలను వక్రీకరిస్తున్న టీడీపీ, పచ్చ మీడియా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులు చూపుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కేవలం వృద్ధాప్యం, అనారోగ్య పరిస్థితుల వల్లే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అయితే టీడీపీ నేతలతోపాటు ఆంధ్రజ్యోతి, ఈనాడు పచ్చ పత్రికలు ఈ వాస్తవాలను వక్రీకరించి స్కిల్ స్కాంతో చంద్రబాబుకు సంబంధమే లేనట్లుగా వార్తలను ప్రచురించాయన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం చంద్రబాబు అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ బెయిల్ మంజూరు చేశారన్నారు. ఇందుకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన 39 పేజీల తీర్పు ఉత్తర్వులను మీడియాకు వెల్లడించారు. ఇందులో రాజకీయ కారణాలు లేవని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ కేసును మరింత లోతుగా లోయర్ కోర్టు విచారిస్తుందని హైకోర్టు చెప్పిందని గుర్తు చేశారు.

అమృతానగర్ కాలనీని 2010 నుంచి పట్టించుకోలేదు

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించిన అమృతానగర్ కాలనీని 2010 నుంచి ఏ ప్రభుత్వం, పాలకులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి తెలిపారు. 108 ఎకరాల్లో 2,770 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇప్పటి వరకు ఇక్కడ కరెంటు, నీరు, రోడ్డు సౌకర్యం లేదన్నారు. ప్రస్తుతం ఈ సమస్యను ప్రజలు తమ దృష్టికి తేవడంతో మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు రూ.5.70 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశామని తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొన్న లారీ

– వ్యక్తికి గాయాలు, ఎద్దు మృతి

చాపాడు : మండల పరిధిలోని మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని కేతవరం వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎడ్ల బండిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండిని తోలుతున్న ఎస్.ఓబాయపల్లెకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి గాయపడ్డాడు. మైదుకూరు వైపు ఇసుక లోడుతో ఎడ్ల బండి వెళుతుండగా వెనకాల వస్తున్న కర్ణాటకకు చెందిన లారీ బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి గాయపడటంతో పాటు ఒక ఎద్దు మృతి చెందింది.

గాయపడిన వ్యక్తి మృతి

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి(50)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు ఈనెల 14వతేదీన నాగిరెడ్డి పనిమీద ఉప్పలూరు నుంచి చిన్నకత్తెరపల్లెకు బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. చిన్నకత్తెరపల్లెనుంచి ఎదురుగా మోటార్‌బైక్‌పై వస్తున్న సోంపల్లె గ్రామానికి చెందిన కృష్ణయ్య బైకు నాగిరెడ్డి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన నాగిరెడ్డిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

మైదుకూరు : పట్టణంలోని శివుని మాన్యం వీధిలో ఈనెల 19న జరిగిన ఓ చోరీ కేసులో మైదుకూరు అర్బన్ పోలీసులు మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివుని మాన్యం వీధిలో ముద్దం శ్రీదేవి అనే మహిళ ఈనెల 19న బంధువుల ఊరికి వెళ్లారు. ఆమె ఇంటి కింద పోర్షన్‌లో పండ్ల వ్యాపారం నిర్వహించే హుస్సేన్ బాషా నివాసం ఉంటున్నాడు. హుస్సేన్ బాషా కుమారుడు మహబూబ్ హుస్సేన్, మేనల్లుడు షేక్ అఫన్, వారి స్నేహితుడు ఎల్లాల చంద్రమోహన్ అనే ముగ్గురు శ్రీదేవి నివాసం ఉంటున్నపై పోర్షన్ ఇంటి తాళాలను చిన్న రంపంతో కోసి ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలో ఉన్న బీరువా తలుపులను పగులగొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలను, రూ.30వేలు నగదును చోరీ చేశారు. సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలను, ఒక మోటార్ బైక్‌ను రికవరీ చేశారు.

నవశకం



జీవితాంతం రుణపడి ఉంటా



నాకు చిన్నతనం నుంచే అంగవైకల్యం ఉంది. చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో తండ్రి వద్ద ఉంటున్నాను. నా తండ్రి కూలి పనులకు వెళితేనే పూటగడిచే పరిస్థితి. నా అవసరాల కోసం సదరం సర్టిఫికెట్ మంజూరైతే పింఛన్ వస్తుందనే ఆశతో అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా సర్టిఫికెట్ మంజూరు కాలేదు. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్టిఫికెట్ మంజూరు చేశారు. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాను. – ఎస్.హుస్సేనమ్మ, అబ్బురాతివీధి, బద్వేలు

ఇంటి స్థలం మంజూరైంది



మేము గత 40 సంవత్సరాలుగా కడప నగరంలోని మామిళ్లపల్లె ప్రాంతంలో నివాసం ఉంటున్నాము. చంద్రబాబు హయాంలో జన్మభూమిలో రేషన్‌కార్డు, ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేశాము. కానీ మంజూరు కాలేదు. ప్రస్తుతం జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత దరఖాస్తు చేసిన మొదటి విడతలోనే రేషన్‌కార్డుతో పాటు ఇంటి స్థలం కూడా మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి నా అకౌంటులో రూ. 1.80 లక్షలు మొత్తం కూడా పడింది. జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం. – షేక్ కల్పనాబేగం, మామిళ్లపల్లె జగనన్న కాలనీ, కడప